# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రభుత్వ పాలన.. ప్రజా అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ స్పష్టం చేశారు.

- పాకిస్థాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఐక్యరాజ్య సమితి వేదికను దుర్వినియోగం చేస్తోందని భారత్ విమర్శించింది.

- ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో విశ్వసనీయ భాగస్వాముల మధ్య సహకారం గతంలో కంటే మరింత కీలకంగా మారిందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

- కోల్‌కతాలో గోదాం పైకప్పు కూలిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

- అరుణాచల్ ప్రదేశ్ లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పన్యేర్ జిల్లాలో ఆకస్మిక వరదలు సంభవించాయి.

=================

"వీఐపీ కల్చర్ ఇన్ ఇండియా" అనే పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ న్యూఢిల్లీలో ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికార వ్యవస్థలు, సాధారణ పౌరుల మధ్య తరచుగా ఏర్పడే దూరాన్ని ఈ పుస్తకం ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రజా కేంద్రిత పాలన ద్వారా ఈ అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశ గుర్తింపును ఈ పుస్తకం చాటుతుందని, అలాగే రాజ్యాంగం ప్రతిపాదించిన న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వంటి విలువలను పునరుద్ఘాటిస్తుందన్నారు. ప్రస్తుత ప్రజాస్వామ్య సవాళ్లను భారతదేశ సుదీర్ఘ ప్రజాస్వామ్య సంప్రదాయాలతో అనుసంధానం చేస్తూ ఈ పుస్తకం పాఠకులకు చారిత్రక దృక్పథంతో పాటు నైతిక అవగాహనను అందిస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయడానికి ఇలాంటి ఆలోచనలు ఎంతో ముఖ్యమని అన్నారు. పాలన అధికార వ్యవస్థకు అనుగుణంగా కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఉపరాష్ట్రపతి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి వేదికను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తూ... కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తటస్థంగా వ్యవహరించాల్సిన సహాధ్యక్ష హోదాను పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తోందని భారత్ విమర్శించింది. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తకార్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలకు భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ ప్రతిస్పందిస్తూ.. జమ్మూ కశ్మీర్‌పై భారతదేశం దీర్ఘకాలంగా కొనసాగిస్తున్న వైఖరిని పునరుద్ఘాటించారు. జమ్మూ కశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం పూర్తిగా భారతదేశ అంతర్గత వ్యవహారమని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా ఐక్య రాజ్యసమితి సంస్కరణల్లో భాగమైన UN-80 ఫ్రేమ్‌వర్క్ కింద ఐరాస ఆదేశాల పునః సమీక్ష ప్రక్రియ గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఈ ప్రక్రియ ద్వారా ఐక్యరాజ్యసమితి వ్యవస్థలో సామర్థ్యాన్ని పెంచడం, సంస్థ పని తీరును మరింత సమర్థవంతంగా మార్చడం లక్ష్యంగా ఉందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = =

నిర్మాణంలో ఉన్న గోదాం పైకప్పు కూలిన ఘటన కోల్‌కతాలోని తారాతలా ప్రాంతంలో ఈరోజు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనా స్థలాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువెంధు అధికారి సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ ప్రమాదంపై కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (KMC) నివేదికను సిద్ధం చేస్తోందని విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. తారాతలా ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను రేపు అసెంబ్లీలో వెల్లడిస్తామన్నారు. ప్రాథమిక దశలో స్థానిక ప్రజలను కూడా రక్షణ చర్యల్లో భాగస్వామ్యం చేసిన అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కృషిని ఆయన అభినందించారు. సహాయక, రక్షణ చర్యల్లో భారత సైన్యం, జాతీయ విపత్తు స్పందన దళం (NDRF), పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి పని చేస్తున్నారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ఫేజ్-IV కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి త్రిపురలో చేపట్టనున్న 96 రహదారి పనులకు కేంద్ర ప్రభుత్వం 211 కోట్ల రూపాయలకు పైగా నిధులను ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 160 కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఆమోదించిన ప్రాజెక్టుల ద్వారా త్రిపురలోని 96 ఆవాస ప్రాంతాలకు తొలిసారిగా అన్ని కాలాల్లో ఉపయోగించగల రహదారి సౌకర్యం అందుబాటులోకి రానుంది. మెరుగైన రహదారి అనుసంధానం వల్ల పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ మార్కెట్లు వంటి ప్రాథమిక సేవలకు, ప్రజలకు సులభమైన ప్రాప్యత లభిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటివరకు త్రిపుర రాష్ట్రంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద మొత్తం 1,594 రహదారి పనులకు కేంద్రం అనుమతులు మంజూరు చేసిందని.. వీటి ద్వారా 6 వేల 284 కిలోమీటర్ల రహదారులు, 66 వంతెనల నిర్మాణం చేపట్టగా, మొత్తం 4 వేల 479 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టినట్లు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

విరామం

= = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న సవాళ్ల నేపథ్యంలో భారత్-దక్షిణ కొరియా సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. ఉమ్మడి విలువలు, పరస్పర

విశ్వాసం ఉన్న దేశాలు మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న ఆయన ఈరోజు ఆ దేశ విదేశాంగ మంత్రి చో హ్యూన్ తో సియోల్ నగరంలో సమావేశమయ్యారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో విశ్వసనీయ భాగస్వాముల మధ్య సహకారం గతంలో కంటే మరింత కీలకంగా మారిందని జైశంకర్ ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఇరు దేశాల మధ్య రాజకీయ సంబంధాలు, నౌకా నిర్మాణం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, సంస్కృతి, ప్రజా సంబంధాలు వంటి రంగాల్లో కొనసాగుతున్న సహకారాన్ని సమీక్షించినట్లు జై శంకర్ సామాజిక మాధ్యమం “ఎక్స్” వేదికగా తెలిపారు. అలాగే స్టార్టప్‌లు, ఫిన్‌టెక్ రంగాలు, బహుపాక్షిక వేదికల్లో కలిసి పని చేసే అవకాశాలపై కూడా చర్చించినట్లు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలు, మహారాష్ట్రలోని మిగిలిన ప్రాంతాలు, అలాగే ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. దీంతో ఆయా ప్రాంతాల్లో రుతుపవనాల ప్రభావం మరింత పెరిగి వర్షపాత పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉందని IMD వెల్లడించింది. మధ్య భారతదేశంలో రేపు భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని IMD శాస్త్రవేత్త శశికాంత్ మిశ్రా వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = =

అరుణాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వర్షాల కారణంగా పన్యోర్ జిల్లాలో ఆకస్మిక వరదలు సంభవించాయి. యాజాలి సర్కిల్ పరిధిలోని పూసా సమీపంలోని నీప్కో ప్రాజెక్ట్ కాలనీ వద్ద వరద ప్రవాహానికి పలువురు గల్లంతయ్యారు. అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దిగువ ప్రాంతాల్లో వరదలు వచ్చే అవకాశాలు పెరగడంతో అసోం ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసింది.

= = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = =